# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-04-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈరోజు విడుదల చేశారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు.**
3. **జాతీయ స్థాయి ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్-2024కు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం అయింది.**
4. **రాష్ట్రంలో ఈనెలాఖరు వరకు తీవ్ర వడగాల్పులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.**
5. **చైనాలోని షాంఘైలో జరుగుతున్న ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత్ మూడు స్వర్ణ పతకాలు సాధించింది.**

==========================

రాష్ట్రంలో గత 58 నెలల కాలంలో తమ ప్రభుత్వం హామీలు అమలు చేసిన తీరు చరిత్రలో నిలిచిపోతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మ్యానిఫెస్టో 2024ను ఆయన ఈరోజు విడుదల చేశారు. మ్యానిఫెస్టోలో అమ్మఒడి పథకం కింద ఇచ్చే నగదును 15 వేల నుంచి 17 వేల రూపాయలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. వైఎస్సార్ చేయూత నాలుగు విడతల్లో 75 వేల రూపాయల నుంచి లక్షా 50 వేల రూపాయలకు పెంచుతున్నట్లు, వైఎస్సార్ కాపు నేస్తం పథకం కింద నాలుగు దఫాల్లో 60 వేల నుంచి లక్షా 20 వేల రూపాయల వరకు పెంచుతున్నట్లు తెలిపింది. వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద నాలుగు దఫాల్లో 45 వేల నుంచి లక్షా 5 వేల రూపాయల వరకు పెంపు, పింఛన్‌ను రెండు విడతల్లో 3 వేల 5 వందల రూపాలయకు పెంచగా.. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 3 లక్షల రూపాయల వరకు రుణాలు తదితర హామీలను మ్యానిఫెస్టోలో ప్రకటించింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. దేశ భవిష్యత్తును మార్చే అవకాశం ఓటు హక్కుకు మాత్రమే ఉందని అన్నారు. గుంటూరులో మొదటిసారి ఓటు హక్కు పొందిన వారికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా జరిగిన 3కె రన్ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన

అధికారి , గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ..ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతోందనీ అందువలన ప్రతీ ఒక్కరు ఓటు వేసేందుకు ముందుకు రావాలనీ కోరారు.

-------------------------

పింఛన్ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళి అమలు దృష్ట్యా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరింది. మార్చి 30వ తేదీన జారీ చేసిన పింఛన్ సహా నగదు బదిలీ పథకాలకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను వాస్తవిక దృష్టితో ఆలోచించి అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డికి సూచించింది. పింఛన్ల ఇంటింటి పంపిణీకి వాలంటీర్లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

-------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రేపటి నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ప్రచార సభలను ప్రారంభిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. అదేరోజు తిరుపతి జిల్లా వెంకటగిరి, నెల్లూరు జిల్లా కందుకూరులో జరగనున్న బహిరంగ సభల్లో ఆయన ప్రసంగిస్తారని, ప్రతిరోజూ మూడు నియోజకవర్గాల్లో సభలు జరుగుతాయి పార్టీ వర్గాలు తెలిపాయి.

ఇలా ఉండగా... జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా బస్సు యాత్ర ఈనెల 25వ తేదీతో ముగిసింది.

-------------------------

కేంద్ర ప్రభుత్వంలోని పలు విభాగాల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్-యుపిఎస్సి చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా వచ్చే ఏడాది నిర్వహించే పరీక్షల క్యాలండర్‌ను ప్రకటించింది. 2025 సంవత్సరంలో చేపట్టే ఉద్యోగ నియామక పోటీ పరీక్షల తేదీలతో ప్రత్యేక వివరాలను ప్రకటించింది. 2025 జనవరి నుండి డిసెంబర్ వరకు నిర్వహించే పరీక్షల తేదీలను పేర్కొంది. దీని ప్రకారం వచ్చే జనవరి 22 నుండి ఫిబ్రవరి 11వ తేదీ వరకు సివిల్స్ ప్రలిమినరీ పరీక్షకు దరఖాస్తులు స్వీకరించి మే 25వ తేదీన పరీక్ష నిర్వహిస్తారు. ఆగష్టు 22వ తేదీ అయిదు రోజులపాటు యూపిఎస్సి మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి.

-------------------------

జాతీయ స్థాయి ఇంజనీరింగ్ విద్యా సంస్థల్ల ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ డ్-2024కు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం అయింది. అభ్యర్థులు మే 7వ తేదీ వరకు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 10వ తేదీ సాయంకాలం 5 గంటల వరకు ఫీజు చెల్లించవచ్చు. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన 2.5 లక్షల మంది విద్యార్థులు మాత్రమే అడ్వాన్స్ పరీక్ష కు దరఖాస్తు చేసుకోవచ్చు. మే 26వ తేదీన పరీక్ష జరగనుండగా, 17వ తేదీన అడ్మిట్ కార్డులను విడుదల చేయనున్నారు.

-------------------------

రాష్ట్రంలో వడగాల్పుల తీవ్రత రోజురోజుకు తీవ్రమవుతోంది. సగానికి పైగా జిల్లాల్లో వడగాల్పులు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పలు చోట్ల 42 నుండి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితి నెలాఖరు వరకు కొనసాగనుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ రోజు 64 మండలాల్లో తీవ్ర వడగాల్పులు.. 183 మండలాల్లో వడగాల్పులు వీస్తాయనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.

-------------------------

చైనాలోని షాంఘైలో జరుగుతున్న ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత్ మూడు స్వర్ణ పతకాలు సాధించింది. భారత్ కు  చెందిన వెన్నం జ్యోతి సురేఖ , అదితి గోపీచంద్ స్వామి , పర్నీత్ కౌర్ మహిళల బృందం ఫైనల్లో ఇటలీని 236-225తో ఓడించి స్వర్ణ పతకం సాధించారు. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో జ్యోతి సురేఖ వెన్నం-అభిషేక్ వర్మ జంట 158-157తో ఎస్టోనియాను ఓడించి స్వర్ణాన్ని గెలుచుకోవడంతో భారత్ మూడవ స్వర్ణ పతకం సాధించింది.

అభిషేక్ వర్మ, ప్రియాంష్, ప్రథమేష్ ఫుగేలతో కూడిన పురుషుల జట్టు 238-231తో నెదర్లాండ్స్‌పై గెలిచి ఫైనల్‌లో స్వర్ణ పతకం గెలుచుకుంది. పురుషుల విభాగంలో ప్రియాంష్, మహిళల విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ వ్యక్తిగత సెమీ ఫైనల్స్‌లో పోటీపడనున్నారు.

---------------------------

రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోని ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తోన్న కాంట్రాక్టు ఉద్యోగుల పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ ఏడాది మార్చితోనే వారి గడువు ముగియగా, ఆయా విభాగాధిపతుల విజ్ఞప్తి మేరకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగించినట్లు పేర్కొంది.

---------------------------

ప్రభుత్వ రంగ సంస్థ  ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ ఏజెన్సీ-ఐఆర్ఈడీఏ కేంద్ర ప్రభుత్వం నుంచి నవరత్న హోదా అందుకుంది. దీంతో ఐఆర్ఈడీఏ కేంద్రం అనుమతి అవసరం లేకుండానే వెయ్యి కోట్ల రూపాయల వరకు నిధులు సమకూర్చుకోవచ్చు. పారిశ్రామిక రంగంలో మినీరత్న, నవరత్న, మహారత్న అనే హోదాలు ఉంటాయి. ఐఆర్ఈడీఏ 2015లో మినీరత్న హోదా అందుకుంది.  ప్రస్తుతం దేశవ్యాప్తంగా 17 ప్రభుత్వ రంగ సంస్థలకు నవరత్న హోదా ఉంది.

---------------------------

రైలు ప్రయాణీకులకు కేవలం 20 రూపాయలకే భోజనం అందించే పథకాన్ని 100 స్టేషన్లకు పెంచుతున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 51 స్టేషన్లలో ఈ కార్యక్రమం నడుస్తోంది. రైళ్ళ జనరల్ క్లాస్ బోగీలు ఆగే చోట ఈ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించింది. 20 రూపాయలకి భోజనంతో పాటు 50 రూపాయలకి అల్పాహారానికి పరిశుభ్రంగా, అందరికీ అందుబాటు ధరలో ఇస్తున్నామని ఓ ప్రకటనలో తెలియజేసింది.

---------------------------

ప్రజాస్వామ్యం గొప్పదనాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల పోలీసు పరిశీలకులు దీపక్ మిశ్రా పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో నిన్న ఆయన పర్యటించి.... జిల్లా ఉన్నత అధికారులు, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా దీపక్ మిశ్రా  మాట్లాడుతూ... ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలనీ, ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలనీ సూచించారు.

======================